క్లుప్తంగా

ఎనర్జీ అసిస్టెంట్లను ఉద్యోగులుగా గుర్తించాలి


విద్యుత్ శాఖ ఏఈ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

రాయచోటి : రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలలో నియమితులైన ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ గ్రామ వార్డ్ సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం విద్యుత్ శాఖ ఏడీఈ చాన్‌బాషా, ఏఈ నగరాజులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్ల ప్రొబేషన్ డిక్లరేష్ జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారానే ఎస్ఆర్‌లు ఓపెన్ చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పలువురు ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

రాయచోటి అర్బన్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె 15వ రోజు కూడా కొనసాగింది. యూనియన్‌నాయకురాళ్లు విజయమ్మ, సిద్దమ్మ,నాగమణి, అరుణ, మస్రూన్‌బీ, సుమలత, వనజ, ప్రవీణ, సబీనా, రమీజా పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

రాజంపేట : తమ సమస్యల పరిష్కారానికి రాజంపేట మున్సిపాలిటీ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. కనీసం వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, మెడికల్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించాలన్నారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, మున్సిఫల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ఓబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, రాజంపేట మున్సిపాలిటి నాయకులు ప్రసాదు, రమణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ నేతల వినతి

రాయచోటి అర్బన్ : భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జనవరి 3న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీటీఏ నేతలు రామచంద్ర, ఆర్.రవిశంకర్, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళ వారం వారు డిఈఓ పురుషోత్తంను కలుసుకుని ఈమేరకు వినతిపత్రమిచ్చారు. ప్రతి మండలంలో మహిళా ఉపాధ్యాయినిలను ఎంపికచేసి సత్కరించే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

మాండవ్య నదికి రక్షణ గోడను నిర్మించండి

రాయచోటి అర్బన్: మాండవ్యనదికి రక్షణ గోడను నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నేత ఎం. విశ్వనాథ్ డిమాండ్ చేశారు. నదికి రక్షణ గోడలను నిర్మించాలంటూ ఆయన పాత రాయచోటి ప్రజలతో కలసి మంగళవారం నదిఒడ్డున నిరసన ప్రదర్శన చేశారు. ప్రభుత్వం స్పందించి నదికి ఇరువైపుల రక్షణ గోడలను నిర్మించి ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడాలంటూ కోరారు.

విరాళం

పుల్లంపేట: పుల్లంపేట తహశీల్దార్ నరసింహ కుమార్ దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతంపల్లి పంచాయతీలోని జానకీపురం పంచాయతీలో మోటార్ కాలిపోయి తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో తహసీల్దార్ రూ. 15 వేలు మరమ్మతుల నిమిత్తం అందజేశారు. దీంతో జానకీపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దత్తాత్రేయ జయంతి ఉత్సవాలు

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయితీ పరిధిలోని దర్బారుసాయి నగరంలో శ్రీ దత్తాత్రేయ జయంతి ఉత్సవాలను మంగళవారం శ్రీ దర్గా స్వామి కార్యనిర్వాహకులు సత్యమయ్య, శంకర్ స్వాముల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దర్గాలో ఖాదర్‌వల్లి బాబా జెండా ఉత్సవాలు , రాత్రికి శ్రీ సాయి నాధుని పల్లకిలో ఉత్సవాలు జరిగాయి.

అన్నదానం

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, కుమ్మరిపల్లెకు వెళ్లే దారిలో వెలసిన శ్రీ సాయినాథుని సన్నిధిలో మంగళవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కటారు మునీంద్ర ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని కటారు సుబ్బరాయుడు, తులమ్మ, కుమారి, కె సురేష్ బాబుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త బద్రిబాబు, ఏపీఎం వసుంధర, సునీత, శ్రీ నికేష్, జోషిక, బాబు, అరుణ, పవన్, నట్వా వినయ్ కుమార్, సాయి, సుమంత్, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆట అదిరింది.. మైదానం మురిసింది

ఓ సారి బంతి రివ్వున
దూసుకొచ్చింది..
బ్యాటు ధాటికి బౌండరీ దాటింది..
మరోసారి గింగిరాలు తిరుగుతూ
వికెట్లను ముద్దాడింది...
బ్యాటుకు..బంతికి మధ్య
జరిగిన పోరు..జోరుగా
సాగింది..

'కో..' అనే శబ్దం హాయిగా
చెవిన పడింది...
అవును.. పల్లె ఆట ఖో ఖో
మళ్లీ జీవం పోసుకుంది..

వాలీబాల్ ఎంచక్కా గాలిలో
ఎగిరింది..
ఆటగాళ్ల ప్రతిభను మెచ్చి
నెట్టు సైతం ముచ్చటపడింది.

కబడ్డీ..కబడ్డీ...కూత మార్మోగింది.
గిరి గీసి బరిలోకి దిగిన
ఆటగాళ్ల కదలికలకు
గ్రౌండు దద్దరిల్లింది..

ఇన్నాళ్లు ముళ్లపొదలతో..
పిచ్చి మొక్కలతో నిండిన మైదానాలు..
ఆడుదాం ఆంధ్రా ఆటలతో
కళకళలాడాయి.. మట్టిలో మాణిక్యాల
ప్రతిభకు మైదానాలు మనసారా
నవ్వాయి.. రాయచోటి, రాజంపేట,
రైల్వేకోడూరులో జరిగిన ఆడుదాం
ఆంధ్రా పోటీలు మంగళవారం
ఘనంగా ప్రారంభమయ్యాయి.


సిద్దవటంలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


రాజంపేట: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి


కోడూరులో.. క్రికెట్ ఆడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

- వేడుకగా ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

రైల్వేకోడూరు: కోడూరులో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రికెట్ కిట్స్, వాలీబాల్ కిట్, బ్యాడ్మింటన్ కిట్‌లను అందజేశారు. అలాగే క్రికెట్, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెట్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ కమిటీచైర్మన్ సుబ్బరామ రాజు, సిద్దయ్య, డైరెక్టర్‌లు మందల నాగేంద్ర, ముజీబ్, సుధాకర్‌రాజులు, సిహెచ్.రమేష్, బండారు మల్లిఖార్జున, తుమ్మల సురేష్, నందాబాల, సుబ్బయ్య, దాడిశెట్టి సిద్దు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్‌రాజు పాల్గొన్నారు.

పుల్లంపేట: పుల్లంపేటలో నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆటలను ప్రారంభించారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. జేఏసీ కన్వీనర్ హరినాథ్ రెడ్డి , తహశీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, ఎస్ఐ రఘురాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పండుగను తలపించే సందడి

సంబేపల్లె : సంక్రాంతి పండుగను తలపించేలా ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు జరుగుతున్నాయని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవపట్ల సమీపంలోని క్రీడా మైదానంలో స్పెషల్ ఆఫీసర్ మద్దిలేటితో కలిసి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ప్రారంభించారు. సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, వైఎస్సార్ సిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, తహశీల్దార్ మహేశ్వరీ బాయ్, ఎంపీడీఓ నరసింహులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

రామాపురం: మండలంలోని సద్దుమళ్ల గ్రామం, నల్లగుట్టపల్లె గ్రామంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాధరెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలలో రాణించాలి

నందలూరు(రాజంపేట):విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో రాణించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహాత్మజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారుల స్ఫూర్తిని నింపేందుకు ఏపీఎం వసుంధర టీమ్ కబడ్డీ ఆటలో పాల్గొన్నారు. స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మండలఉపాధ్యక్షులు నాయనపల్లి అనుదీప్ జయసింహ పాల్గొన్నారు.

క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ

గాలివీడు: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఖాదర్‌మోద్దీన్(ఎస్‌కే), మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుండ్లచెరువు, గోపనపల్లె గ్రామాల మధ్యలో గల మైదానంలో పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఎంపీడీఓ శేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

యువతకు 'ఆడుదాం ఆంధ్రా'వరం

లక్కిరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంత యువతకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వరంలాంటిదని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి మాజీ ఎంపిపి రెడ్డయ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్‌తో కలిసి ఎంపిపి సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలతోపాటు ఉపాధ్యాయులతో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ రమణయ్య, ఎంపీటీసీలు దస్తగిరి, శంకర్ నాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు ఎ రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి ప్రతిష్ట

రాజంపేట టౌన్: క్రీడల వల్ల కీర్తి ప్రతిష్టతలు కూడా లభిస్తాయని ఆర్డీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ప్రారంభించారు.మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి మాటాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంఈఓ కొండూరు రఘునాథరాజు, పోటీల ఆర్గనైజర్ ఎస్.షామీర్‌బాషా, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, కౌన్సిలర్లు న్యామతుల్లా, సనిశెట్టి నవీన్‌కుమార్, సూరి, తోట లక్ష్మీనారాయణ, మునాఫ్ పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. ముక్కవారిపల్లె గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ విజయారావు,ప్రత్యేకాధికారి నాగభూషణం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొర్లకుంట సచివాలయంలో ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీటీసీ వత్తలూరు రోహిణీ కుమార్ రెడ్డి ప్రారంభించారు. బాలిరెడ్డిపల్లిలో బాబు రెడ్డి , చెన్నరాజుపోడు సచివాలయంలో జిల్లా వక్ఫోర్డ్ డైరెక్టర్ సుంకేసుల రఫీ, సర్పంచ్ సుంకేసుల ఇబ్రహీమ్ పోటీలను ప్రారంభించారు. తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీటీసీ ఎ సుబ్రమణ్యం, కొర్లకుంట ఉపసర్పంచ్ ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి, డీఆర్‌సీసీయు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించడానికే పోటీలు

సిద్దవటం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో భాగంగా వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నమండెం : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ దివ్య, తహసీల్దార్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఉన్న జడ్పీహెచ్ఎస్ లో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి మొదటి బంతిని ఆడి ప్రారంభించగా, చిన్నకొత్తపల్లి, సాలాబాద్, మంటపంపల్లి గ్రామాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్‌డీ రంగయ్య, ఒంటిమిట్ట సచివాలయ కార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సిద్దవటం: పోటీలను ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

ఆడుదాం ఆంధ్రా.. ఓ మైలురాయి

రైల్వేకోడూరు : మన గ్రామాలలోని క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కోడూరులో పట్టణంలోని ఎంపీడీవో ప్రాంగణంలో, హెచ్ఎమ్ఎమ్ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. అలాగే పుల్లంపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలమైదానంలో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 76 సచివాలయాల పరిదిలో 47 రోజుల పాటు ఈ పోటీలు సందడిగా కొనసాగుతాయని అన్నారు. నియోజకవర్గం నుంచి ఇప్పటికే 40వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు.


పుల్లంపేట: మాట్లాడుతున్న కొరముట్ల


ఓబులవారిపల్లె: ముక్కవారిపల్లి గురుకులంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్


రాజంపేట టౌన్: ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి


సంబేపల్లె మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి


గాలివీడు: క్రీడలను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు


లక్కిరెడ్డిపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

రాజంపేట రూరల్: సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారిపై ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీం శివరామకృష్ణదేవరా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎంఎస్ రాయుడు, కాటంశెట్టి వెంకటయ్య సీపీఐ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ మహేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పాల్గొన్నారు.

చిట్వేలి: మండలంలో మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చిట్వేలి, నేతివారిపల్లి, పోల్లోపల్లి, రైల్వేకోడూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు వెంకటయ్య, పార్టీ మండల కార్యదర్శి కేశం ప్రసాద్‌లు జెండా ఆవిష్కరించారు.

హామీలు అమలుచేయాలి

రాయచోటి అర్బన్: కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రామయ్య, ప్రజాసంఘాల నేతలు ఈశ్వర్, రామాంజనేయులు, రెడ్డెయ్య డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన సమ్మెకు ప్రజాసంఘాల నేతలు మంగళవారం మద్దతు ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బస్టాండు సర్కిల్ మీదుగా నేతాజీ సర్కిల్ చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య,రాంబాబు, అగ్గిరామయ్య, సిద్దయ్య, రవికుమార్, వెంకట రమణ, రమణమ్మ,మంగమ్మ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల కోసం పోరాటం

గాలివీడు: డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ ఆశయాల కోసం భారతీయ అంబేడ్కర్ సేన అలుపెరగని పోరాటం చేస్తోందని జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణలు పేర్కొన్నారు. భారతీయ అంబేడ్కర్ సేన ఈనెల 20వ తేది నాటికి 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో వివిధ మండలాలలో కమిటీలు నిర్మాణంలో భాగంగా మంగళవారం గాలివీడు మండలంలో పర్యటించారు. బాస్ సంస్థను బలోపేతం చేయడానికి మండలంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీల అగ్రకులంలో ఉన్నటువంటి పేదలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మండల ఇన్‌చార్జ్ కన్వీనర్ చిన్నా, ఆంజనప్ప పాల్గొన్నారు.

కళ్యాణ కట్టకు భూమిపూజ

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గంగమ్మ తల్లి ఆలయ ఆవరణలో మంగళవారం కళ్యాణ కట్టకు భూమిపూజ చేసినట్లు గంగమ్మ ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సి రవీంధర్ రాజు తెలిపారు. దాతల సహకారంతో కళ్యాణ కట్టను పూర్తిచేసి భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకురావడానికి ఆలయ కమిటీతో కలిసి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

ఆకేపాటి పాదయాత్రకు సంఘీభావం


ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మహా పాదయాత్రకు సంఘీభావం తెలిపిన మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు

సిద్దవటం: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఒంటిమిట్ట కోదండ రామ స్వామి ఆలయంకు మంగళవారం చెపట్టిన 9వ మహా పాదయాత్రకు సిద్దవటం మండల వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మండల యూత్ కన్వీనర్ ఆలం క్రిష్ణచైతన్య, రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డిలు పూలమాల వేసి సంఘీభావం తెలిపారు. జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నాయకులు జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, శోభన్‌రెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా జగనన్న పాలన

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగనన్న పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని దశరథరామిరెడ్డి కళ్యాణమండపంలో మున్సిపల్ పరిధిలోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువును కృష్ణాజలాలలో నింపాలన్నదే తన కల అన్నారు. చక్రాయపేట కాలేటివాగు పథకం పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాకేంద్రంగా చేయడం ద్వారా రాయచోటికి రాష్ట్రంలోనే గుర్తింపు లభించిందన్నారు.

కళ్లకు కట్టినట్టుగా అభివృద్ధి పనులు :

పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన ఏ పట్టణానికి తీసిపోని విధంగా రాయచోటి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. నీళ్లట్యాంకర్ల వద్ద నీటికోసం కొట్లాటలు జరిగే పరిస్థితులు అస్సలు లేవన్నారు. మున్సిపాలిటీలో కరెంటుబిల్లులు కట్టలేని పరిస్థితి నుంచి ముందస్తుగా బిల్లులు చెల్లించే స్థాయికి చేరుకున్నామంటూ చెప్పారు. గ్రేడ్-3 స్థాయినుంచి స్పెషల్‌గ్రేడ్ స్థాయికి చేరుకున్నామని వెల్లడించారు. వందపడకల ఆసుపత్రి, ఆసుపత్రి విస్తరణ, మున్సిపల్ సబాభవనం, నాలుగు పట్టణ ఆరోగ్యకేంద్రాలు, రైతుబజారు, నగరవనం, స్టేడియం నిర్మాణం, రహదారుల విస్తరణ, రాయచోటిని జిల్లాకేంద్రంగా చేయడం, డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్‌పోలీస్‌స్టేసన్, టీటీడీ కళ్యాణమండం అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎస్‌యన్‌కాలనీలో గ్రాస్‌ల్యాండ్‌లో రూ. 1.20 కోట్లతో టవర్‌క్లాక్ నిర్మాణం, రూ.80 లక్షల నిధులతో చిత్తూరుమార్గంలోని రింగురోడ్డు, మాసాపేటలోని వేంపల్లె క్రాస్‌రోడ్డు, దిబ్బలబడి వద్ద, బంగ్లావద్ద, ఎన్‌జిఓ కాలనీ, అబ్దుల్‌కలాం విగ్రహంవద్ద కూడళ్లసుందరీకరణపనులు జరుగుతున్నాయంటూ తెలిపారు. బడుగు,బలహీన వర్గాల రాజకీయ సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగుతోందన్నారు.

28న బస్‌యాత్రకు రానున్న రాష్ట్రనేతలు

ఈనెల 28న రాయచోటిలో బీసీ సామాజిక సాధికార బస్‌యాత్ర జరుగుతుందన్నారు. యాత్రను పార్టీశ్రేణులు విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రనేతలు అంజద్‌బాషా, అనిల్‌కుమార్ యాదవ్, విడుదల రజనీ, మేరుగ నాగార్జున, నందిగామ సురేష్ తదితరులు పాల్గొంటున్నారన్నారు. గతంలో జగనన్న యిచ్చిన హామీమేరకు జనవరి 1వ తేది నుండి రూ.3వేల పెన్షన్‌ను అందిస్తూ మాటను నిలబెట్టుకుంటున్నారని వివరించారు.

6వేల ఇళ్లలో నారాయణరెడ్డిపల్లె లేఔట్

జగనన్న పాలనలో నియోజకవర్గంలో సుమారు 20వేల పక్కాగృహాలను మంజూరు చేశామన్నారు. నియోజవర్గంలో 93 జగనన్న కాలనీలు నిర్మితమవుతున్నాయన్నారు. పట్టణంలోని పేదల ప్రజల కోసం నారాయణరెడ్డిపల్లె వద్ద జగనన్న కాలనీలో 6వేల గృహాలు నిర్మితం అవుతున్నాయన్నారు. అభివృద్ధి ప్రధాత అయిన జగనన్నకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా నిలిచి మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలతో పాటు పలువురు వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.